'శారదా విజయం.. సాహిత్య రూపకం' 8న

చిక్కడపల్లి:అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నవ్య సాహితీ సమితి, నవ్య నాటక సమితి సంస్థల సంయుక్తంగా ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన బొగ్గులకుంటలోని శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయంలో 'శారదా విజయం.. సాహిత్య రూపకం'కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నవ్యనాటక సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్ తెలిపారు. మంగళవారం చిక్కడపల్లిలోని నవ్యనాటక సమితి కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ప్రభుత్వ ఖజానా లెక్కల శాఖ డిప్యూటీ డైరెక్టర్ వసుంధర ఆవిష్కరించారు.

◆ ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ పూర్వ తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ శరత్‌జ్యోత్స్నారాణి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ శారదా విజయం అనే సాహిత్య రూపకంలో డాక్టర్ జీఎల్‌కే దుర్గ, డాక్టర్ ఉప్పలపాటి కుసుమకుమారి, వల్లూరి శ్రీమణి, శ్రీవల్లీ ఫణీంద్ర, మంచినీళ్ల సరస్వతి రామశర్మ, మంకాల లక్ష్మీమానస, గాడిచర్ల స్నేహ రాంచందర్ వంటి ప్రముఖ మహిళా కళాకారులు పాల్గొంటారని తెలిపారు.

బ్యాడ్మింటన్ కోర్టు పనులు సకాలంలో పూర్తి చేయాలి

నల్లకుంట: డివిజన్ పరిధిలోని టీఆర్టీకాలనీలో సుమారు రూ.16లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన బ్యాడ్మింటన్ కోర్టు అభివృద్ధి, సుందరీకరణ పనులను మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పరిశీలించారు. అనంతరం కాలనీలో జరుగుతున్న ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. బ్యాడ్మింటన్ కోర్టులో చేపట్టిన ప్రహరీ నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అలాగే బ్యాడ్మింటన్ కోర్టులో అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చర్యలు తప్పవు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: 'ఆక్రమణల తొలగింపు మొక్కుబడి'అనే శీర్షికతో సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం సాయంత్రం చిక్కడపల్లి ఎస్సై కార్తీక్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్కు ముందు ఉన్న ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకుని వ్యాపారాన్ని కొనసాగిస్తున్న వారికి జరిమానా విధించారు. వెంటనే ఇక్కడి నుంచి డబ్బాలను తొలగించాలని ఆదేశించారు. అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనదారులకు కూడా ముందస్తుగా హెచ్చరికలు జారీ చేసి అక్రమ పార్కింగ్ చేస్తే వాహనాలను తరలించాల్సి ఉంటుందన్నారు. ట్రాఫిక్ పోలీసులు తీసుకున్న చర్యలపై వాకర్స్ హర్షం వ్యక్తం చేశారు. ఉదయం వేళ కూడా వచ్చి ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తున్న చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ధోబీఘాట్ బస్తీ సమస్యలను పరిష్కరించండి

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని ధోబీఘాట్ బస్తీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బస్తీవాసులు మంగళవారం కార్పొరేటర్ పావనికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైనేజీ, తాగునీటికి నూతన పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాలన్నారు. బస్తీవాసుల సౌకర్యార్థం సామాజిక భవన నిర్మాణం చేపట్టాలన్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. బస్తీలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, స్థానిక రజక సహకార సంఘం ప్రతినిధులు నాగేష్, రమేష్, మల్లికార్జున్, సురేష్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి

చిక్కడపల్లి: సంక్షేమ బోర్డు పథకాలను ప్రైవేట్, కార్పొరేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మికశాఖ కమిషనర్ కార్యాలయంలో అదనపు కమిషనర్ డాక్టర్ గంగాధర్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారానే పథకాలను అమలు చేసేలా నిర్మాణాత్మక చర్యలు చేపట్టాలన్నారు. కార్మికులందరికీ ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు అరుణ, జి.అనురాధ, శివబాబు, నర్సింహ, యాదన్న, బాలరాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: స్థానిక సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె. రవిచారి అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని నెహ్రూనగర్ బీ-కాలనీలో డ్రైనేజీ పనులు చేపట్టడంతో పాటు కొత్త మ్యాన్‌హోల్లను వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు మక్కన్ సింగ్, అరవింద్, సుదర్శన్‌సింగ్ పాల్గొన్నారు.

సీసీ ష్రాఫ్ ఆస్పత్రి వద్ద షెల్టర్ లేక రోడ్డుపైనే ప్రయాణికులు



నారాయణగూడ మెట్రో స్టేషన్ వద్ద బస్‌షెల్టర్ లేక నిల్చున్న దృశ్యం



కాచిగూడ బస్టాప్‌లో డస్ట్‌బిన్‌ల ఏర్పాటు



శాంతి టాకీస్ బస్టాప్ వద్ద వాహనాల అక్రమ పార్కింగ్



బస్టాప్‌ల నిర్వహణ శూన్యం



సుందర్‌నగర్ బస్‌షెల్టర్‌లో పండ్ల దుకాణం



చాదర్‌ఘాట్ చౌరస్తా బస్టాప్‌లో తోపుడు బండ్లు



నింబోలిఅడ్డ బస్టాప్‌లో ఏర్పాటు చేసిన టిఫిన్ సెంటర్



కాచిగూడ స్టేషన్ రోడ్డు బస్‌షెల్టర్‌లో ప్రమాదకరంగా ఏర్పాటు చేసిన విద్యుత్ బాక్స్‌లు

కాచిగూడ: బస్సు ఎక్కాలంటే దాని కోసం బస్టాప్‌లో ఎదురుచూపులు తప్పవు. కొన్ని ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్నా బస్‌షెల్టర్ కింద నిలబడుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో అయితే బస్టాపులు ఆక్రమణకు గురికాగా మరికొన్ని మూత్రశాలలుగా మారాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. అంబర్‌పేట నియోజకవర్గంలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతో బస్‌షెల్టర్లు నిరుపయోగంగా మారుతున్నాయి. ఇప్పుడు అసలే ఎండాకాలం బస్‌షెల్టర్లు ఇలా ఆక్రమణకు, దుర్గంధంగా ఉంటే ప్రయాణికులు ఎండలో నిలబడాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు దీనిపై స్పందించి బస్ షెల్టర్లకు మరమ్మతులు చేపట్టి.. ఆక్రమణలను తొలగించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఈ బస్టాపుల వద్ద ఇదీ పరిస్థితి..

◆ కాచిగూడ వరంగల్ జాతీయ రహదారి సుందర్‌నగర్ బస్‌షెల్టర్ వద్ద అక్రమంగా వాహనాల పార్కింగ్.
◆ అక్వా కేఫ్ బస్‌షెల్టర్ వద్ద చెత్త పేరుకుపోవడంతో అపరిశుభ్రంగా మారింది.
◆ బర్కత్‌పుర సీసీ ష్రాఫ్ ఆస్పత్రి వద్ద బస్ షెల్టర్ లేక రోడ్డుపైన నిల్చుంటున్న ప్రయాణికులు.
◆ కాచిగూడ స్టేషన్ రోడ్డులో ఉన్న బస్ షెల్టర్ అపరిశుభ్రంగా మారింది.
◆ లింగంపల్లి చౌరస్తాలో బస్ షెల్టర్ ఏర్పాటు చేయాల్సి ఉంది.
◆ బర్కత్‌పుర పీఎఫ్ ఆఫీస్ వద్ద ఉన్న బస్ షెల్టర్ వద్ద ఆటోల పార్కింగ్ అధికంగా ఉంటుంది.
◆ నింబోలిఅడ్డ బస్ షెల్టర్ వ్యాపారాలకు అడ్డగా మారింది.
◆ చాదర్‌ఘాట్ చౌరస్తా బస్‌షెల్టర్ వద్ద బస్ బేలోకి ఆటోలు వస్తుండటంతో బస్సులను రోడ్లపైనే ఆపాల్సి వస్తోంది.

ప్రకటనలతో ఆదాయంపైనే దృష్టి...

ఎక్కడెక్కడ బస్ షెల్టర్ల నిర్మాణం జరపాలో గుర్తింపు ప్రక్రియ ఆర్టీసీ చేపట్టాల్సి ఉండగా వాటి నిర్మాణ బాధ్యత జీహెచ్‌ఎంసీ చూస్తోంది. అయితే చాలా చోట్ల బస్‌షెల్టర్లు ఉన్నా అవి కేవలం ప్రకటనలకు మాత్రమే ఏర్పాటు చేశారు. ప్రయాణికుల ప్రయోజనాలను పక్కన బెట్టి కేవలం ఆదాయం కోసమే ప్రకటనల నిమిత్తం షెల్టర్ల నిర్మాణం జరపడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రయాణికుల నుంచి ప్రతిరోజూ లక్షలాది రూపాయల ఆదాయం ఆర్టీసీకి అందుతున్నా షెల్టర్ల ఏర్పాటులో అలక్ష్యం తగదన్నారు. దీనిపై ఆర్టీసీ, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయంతో వ్యవహరించి బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే ప్రస్తుతం ఉన్న బస్సు షెల్టర్ల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

బస్టాప్‌ల నిర్వహణ లేకపోవడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయం. అయితే బస్ షెల్టర్లన్నీ జీహెచ్‌ఎంసీ పర్యవేక్షణలో ఉన్నాయి. సమస్యను జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సంయుక్తంగా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తాం. బస్‌షెల్టర్లు లేని చోట ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపిస్తాం.

– టి.రఘు, కాచిగూడ డిపో మేనేజర్

తెలంగాణ ఉద్యమ కళాకారులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కామల్ల ఐలయ్య

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణలో ఉపాధి కోల్పోయిన ఉద్యమ కళాకారులను ఆదుకోవాలని తెలంగాణ కళాకారుల వేదిక (టీకేవీ) వ్యవస్థాపక అధ్యక్షుడు కామల్ల ఐలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కవులు, కళాకారులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ... కళాకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాన్ని చాటిచెప్పి రాష్ట్ర సాధనలో క్రియాశీలక పాత్రను పోషించిన కవులు, కళాకారులకు ఉపాధి అవకాశాలు మెరుగు పర్చాలన్నారు. బండి యాదగిరి నుంచి బైరాగి వరకు తెలంగాణ సామాజిక సాంస్కృతిక రాజకీయ అస్తిత్వాన్ని ముందు వరుసలో నిలబడి కాపాడారని అన్నారు. టీకేవీ కన్వీనర్ మోహన్ బైరాగి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నలిగంటి శరత్, సైకిలాబ్, భూపతి, తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, వెంకటయ్య, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేకుల్లో పురుగులు

- మ్యాక్సిమమ్ బేకరీలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు
- ఆహార పదార్థాలను పరిశీలించిన అధికారులు
- కాలం చెల్లిన ఐస్‌క్రీమ్ డబ్బాలు ల్యాబ్‌కు తరలింపు



తనిఖీలు చేస్తున్న జీహెచ్‌ఎంసీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు



కాలం చెల్లిన ఐస్‌క్రీమ్‌లు, కేక్‌లు

అంబర్‌పేట: నాణ్యత ప్రమాణాలు పాటించని బేకరీలపై ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. మంగళవారం ఛేనంబర్ చౌరస్తాలో ఉన్న మ్యాక్సిమమ్ బేకరీలో కలుషిత కేక్‌లు, ఐస్‌క్రీమ్‌లు అమ్ముతున్నట్లు ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు, ఫుడ్‌సేఫ్టీ అధికారులకు బేకరీలోని ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు పురుగులు ఉన్న కేక్‌లను గుర్తించారు. కాలం చెల్లిన ఐస్‌క్రీమ్ డబ్బాలను గుర్తించి అనంతరం వాటిని ల్యాబ్‌కు తరలించారు.

వెల్లుల్లి పేస్ట్ గోడౌన్, బిస్కెట్ కంపెనీలోనూ తనిఖీలు..

◆ గోల్నాకలోని అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేసే గోడౌన్, బిస్కెట్ తయారు చేసే కంపెనీలలో సహితం తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో జీహెచ్‌ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారిని స్వాతి, టాస్క్‌ఫోర్స్ ఎస్సై కరుణకర్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దళారీ పనులు తగవు

కవాడిగూడ: కులాల మధ్య చిచ్చుపెట్టి రాక్షస రాజకీయం చేసిన గత ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ కులం పేరుతో దళారీ పనులు చేసే వారిని ప్రభుత్వం ప్రోత్సహించవద్దని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం ట్యాంక్‌బండ్ జలదృశ్యం వద్ద ఆచార్య కొండా లక్ష్మణ బాపూజీ విగ్రహం వద్ద సంఘం నేతలు మౌనదీక్ష చేపట్టారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వలకాటి రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం బతుకమ్మ చీరల పేరుతో ప్రజాధనాన్ని వృద్ధా చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొందరు పద్మశాలీలు మాస్టర్ వీవర్స్ పేరుతో పాత బకాయిలని పైరవీలు చేస్తున్నారని ఆరోపించారు. పద్మశాలీల పేరుతో దళారీలుగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్



భరత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కవాడిగూడ బీజేపీ అధ్యక్షుడు దిలీప్‌యాదవ్

కవాడిగూడ: రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా నూతన అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్ అన్నారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలిపించి మేయర్ సీటును కైవసం చేసుకోవాలన్నారు. సికింద్రాబాద్ మహంకాళి జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన భరత్‌గౌడ్ మంగళవారం కవాడిగూడ డివిజన్ పార్టీ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్‌ను ఆయన నివాసంలో కలిశారు. బీజేపీ కార్యకర్తలతో టిఫిన్ బైఠక్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భరత్‌గౌడ్‌ను దిలీప్ యాదవ్ శాలువాతో సన్మానించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ విస్మరించిన హామీలపై పోరాటం చేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను గడపగడపకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో గెలిపించాలి..

◆ ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు సముచిత న్యాయం దక్కుతుందన్నారు. పార్టీ అధిష్టానం ప్రతి కార్యకర్త అభిప్రాయాలను గౌరవిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి.రవీందర్, నియోజకవర్గ కన్వీనర్ ఎం. రమేష్‌రాం, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, ఎస్సీ మోర్చా కన్వీనర్ పి. పరుశురాం, నాయకులు జి.వెంకటేష్, పరిమళ్‌కుమార్, ఎంపీ మహేందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఆడబిడ్డ చదువుకోవాలి

సిరికొండ మధుసూదనాచారి

చిక్కడపల్లి: రాబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని త్యాగరాయ గానసభ నిర్వహణలో మంగళవారం వివిధ రంగాలకు చెందిన ప్రతిభావంతులైన మహిళలకు పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి హాజరై మాట్లాడారు. ప్రతి ఆడబిడ్డ చదువుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. సామాజిక సేవా కార్యకర్త ఆత్మీయ లక్కరాజు నిర్మల, సంఘ సేవకురాలు భాగ్యలక్ష్మి, శ్రీలతా వర్మ, జానపద గాయని శ్రీమణిని ఆయన పురస్కారం అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి, గానసభ పాలకమండలి సభ్యురాలు గుండవరపు గీతాదేవి పాల్గొన్నారు.

ఆరెకటిక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కాచిగూడ: ఆరెకటిక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.200 కోట్ల బడ్జెట్ కేటాయించాలని తెలంగాణ ఆరెకటిక సంఘం అధ్యక్షుడు చకోలేకర్ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన సంఘం నేతలతో కలిసి మాట్లాడారు. కోకాపేటలోని ఆరెకటిక సంఘం భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని స్లాటర్ హౌస్‌లను ఆరెకటికలకు కేటాయించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆరెకటికలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆరె కులస్తులకు ఎమ్మెల్సీ పదవీ ఇవ్వాలన్నారు. ఈనెల 10న హైదరాబాద్‌లో ఆరెకటిక కులస్తులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నేతలు కాచిగూడ సూర్యప్రకాష్, డా. విజయభాస్కర్, నర్సింగ్‌రావు, ఎస్.రవికుమార్. అశోక్, సునీత, యవ్వంత్‌రావు, జితేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'శ్రీగురూజీ దృష్టి - దార్శనికత' పుస్తకావిష్కరణ

కాచిగూడ: దేశం, సమాజం అత్యున్నతమనే భావనను ముందుకు తీసుకెళ్లాలని ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేకర్ అన్నారు. మంగళవారం రాత్రి నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ ఆడిటోరియంలో నవయుగ భారతి ముద్రించిన 'శ్రీ గురూజీ దృష్టి - దార్శనికత'అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, నవయుగ భారతి అధ్యక్షుడు పాట్లూరి బాలేంద్ర, కార్యదర్శి నేతి క్షీర్‌సాగర్, పుస్తక రచయిత వేదుల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

భరత్‌నగర్‌లో సీసీరోడ్డు పనులు వెంటనే చేపడతాం

ముషీరాబాద్: భరత్‌నగర్‌లో నెల రోజుల క్రితం రోడ్డును తవ్వి అలాగే వదిలేశారు. మట్టికుప్పలు, సిమెంటు దిమ్మెలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పనులు ప్రారంభించడం లేదని స్థానికులు బీఆర్‌ఎస్ నాయకుడు ముఠా జైసింహకు సమస్యను వివరించారు. వెంటనే ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం రోడ్డు దిమ్మెలు, మట్టికుప్పలను తొలగించారు. సీసీ రోడ్డు పనులు వెంటనే చేపడతామని అధికారులు తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- నల్లకుంటలో ఆరు పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- ఉదయం 9 నుంచి 12 గంటల వరకు
- ఉదయం 8.30 గంటల నుంచే విద్యార్థులకు అనుమతి

నల్లకుంట: ఇంటర్మీడియల్ పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. బుధవారం నుంచి మొదలు కానున్న థియరీ పబ్లిక్ పరీక్షలకు ఇంటర్ బోర్డు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 5వ తేదీన (నేడు) ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తెలుగు/ సంస్కృతం/ హిందీ పరీక్షలు మొదలు కానున్నాయి. ఇంటర్ బోర్డు కార్యదర్శి ఆదేశాలు, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు జిల్లా స్పెషల్ ఆఫీసర్స్/ డీఈవో నేతృత్వంలో ఇతర అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతించరు

◆ నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరు. ఇటీవల ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను కూడా పరీక్ష రాసేందుకు అనుమతిస్తామని ఇంటర్ బోర్డు సెక్రటరీ వెల్లడించారంటూ సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతోంది.

నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో..

◆ నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో 6పరీక్ష కేంద్రాలను కేటాయించారు. హిందీ మహా విద్యాయం, చైతన్య కళాశాల, శివ రోడ్డులోని అల్ఫాన్స్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ప్రైవేటు జూనియర్ కళాశాలల విద్యార్థులే అధికంగా ఉన్నారు. పరీక్ష నిర్వహణకు సీఎస్‌ఏలు,డీవోలు,కస్టోడియన్లు, సిట్టింగ్‌స్క్వాడ్‌లు, ఫ్లయింగ్‌స్క్వాడ్‌లను వినియోగిస్తున్నారు.
◆ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తో పాటు పోలీసు బందోబస్తు కల్పించనున్నారు.
◆ మెడికల్ సిబ్బందితో ప్రాథమిక చికిత్సల కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అంటుబాటులో ఉంచుతున్నారు.
◆ పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాలో పరీక్ష పత్రాలు తెరవనున్నారు.
◆ కొన్ని ప్రత్యేక రూట్లలో ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను నడుపుతోంది.

పశుసంవర్ధక శాఖ మంత్రిని వెంటనే నియమించాలి

తెలంగాణ గోశాల ఫెడరేషన్ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్



గోదానాను పంపిణీ చేస్తున్న మహేష్ అగర్వాల్

కాచిగూడ: తెలంగాణలో పశుసంర్థక శాఖ మంత్రిని వెంటనే నియమించాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ డిమాండ్ చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నారాయణి గోసేవా సదన్‌లో ఖనిజ మిశ్రమ గోదానాను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాచిగూడలోని గోశాల ఫెడరేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా నేటికీ పశుసంవర్ధక శాఖకు ఒక మంత్రి లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పశుసంవర్ధక శాఖ బాధ్యతలను సైతం ముఖ్యమంత్రే చేపడుతున్నారని అన్నారు. అందుకే ఆయన పశుసంవర్ధక శాఖకు తగినంత సమయం కేటాయించలేకపోతున్నారని అన్నారు. అందుకే పశుసంవర్ధక శాఖకు వీలైనంత త్వరగా మంత్రిని నియమించాలని కోరారు. ప్రతి గోశాలకు పశుగ్రాసం, తాగునీటి వసతి కల్పించాలని, పవర్‌బోర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయంపై త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర గవర్నర్‌ను కలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు నిర్మల్‌కుమార్ జైన్, ప్రేమ్‌చంద్ మునోత్, మంజుల మునోత్, రితేష్ జాగీర్దార్, గోశాల ప్రతినిధులు అమృత్ లాల్ సోనీ, మోహన్, కరుణాకరన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థను ఆధునీకరిస్తాం

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



జెమినీకాలనీలో అధ్వానంగా మారిన డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, అధికారులు

ముషీరాబాద్: డివిజన్‌లోని జెమినీకాలనీలో నాలుగు దశాబ్దాల క్రితం వేసిన డ్రైనేజీ పైపులైన్ స్థానంలో జనాభాకు అనుగుణంగా ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం ఆయన జెమినీకాలనీలో బస్తీబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. జలమండలి డీజీఎం మోహన్‌రాజ్, సెక్షన్ మేనేజర్ శివసాయి, జీహెచ్‌ఎంసీ డీఈలు సన్నీ, గీతాకుమారి ఎమ్మెల్యేతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీ, రోడ్లు, కలుషిత నీటి సరఫరాపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ అస్తవ్యస్తంగా మారడంతో కలుషిత నీటి సరఫరా జరుగుతోందని అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలనీలో భారీ చెట్ల కొమ్మలు భవనాలకు అనుకొని పెరుగుతుండటంతో ప్రమాదంగా మారాయని అన్నారు. వాటిని తొలగించాలని ఉద్యానవన శాఖ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

◆ అనంతరం సీసీ రోడ్డు వేస్తామని అందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. విజయ సంఘం ఖాళీ స్థలంలో కమ్యూనిటీహాల్ నిర్మించాలని అధికారులను కోరారు. స్థానిక ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. నెలన్నర రోజుల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని స్పష్టం చేశారు. అనంతరం దాయారం మార్కెట్ నుంచి సాగర్‌లాల్ వరకు పర్యటించి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే రోడ్లు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, జెమినీకాలనీ పెద్దలు బొల్లంపల్లి రాంరెడ్డి, జనార్దన్‌రెడ్డి, ముషీరాబాద్, రాంనగర్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, శంకర్‌ముదిరాజ్, నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, పూసగోరఖ్‌నాథ్, అరుణ్, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.